క్లుప్తంగా

ఎమ్మెల్సీలకు సమాచారమేది?

బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లారెడ్డి

దుబ్బాకటౌన్: నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు ప్రొటోకాల్ పాటించకుండా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడం సరికాదని బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండవెల్లి ఎల్లారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు ఎమ్మెల్సీలు యాదవరెడ్డికి, దేశపతి శ్రీనివాస్‌కు సమాచారం ఇవ్వకపోవడం సరికాదన్నారు. అధికారికంగా ఎలాంటి హోదా లేని కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో ఏ విధంగా పాల్గొంటాడని ప్రశ్నించారు.

ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కేసులు

కొండపాక(గజ్వేల్): విద్యార్థినులు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామంటూ షీటీం ఏఎస్సై శ్యామల హెచ్చరించారు. కొండపాకలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ స్కూల్లో శుక్రవారం మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కుకునూరుపల్లి ఏఎస్సై శంకర్, కానిస్టేబుళ్లు, షీటీం బృందం సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

అక్కన్నపేట(హుస్నాబాద్): సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై విజయ్‌భాస్కర్ అన్నారు. మండలంలోని కట్కూర్‌లో పోలీసు కళాబృందం కనువిప్పు కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరం మేరకే సెల్‌ఫోన్లు వాడాలని, గూగుల్ పే, ఫోన్ పే చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

గురుకులంలో ఫ్రెషర్స్‌డే

వర్గల్(గజ్వేల్): ఫ్రెషర్స్ డే వేడుకలతో వర్గల్ మహాత్మాజ్యోతిబా పూలే గురుకులం అలరారింది. శుక్రవారం రాత్రి కొనసాగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పూలే గురుకులాల జాయింట్ సెక్రటరీ ఎమ్ మద్దిలేటి, ఏజీఓ లక్ష్మయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంస్కృతిక అంశాలతోపాటు గురుకుల విద్యార్థులు చదువులోనూ అత్యున్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గడ్డం భాస్కర్‌రావు, వైస్‌ప్రిన్సిపాల్ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా డిగ్రీ కళాశాల విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. గురుకుల ప్రాంగణంలో పండుగ వాతావరణం అలుముకుంది.

ప్రజలకు రక్షిత మంచినీటిని అందించాలి

మద్దూరు(హుస్నాబాద్): గ్రామాల్లో ప్రజలకు రక్షిత మంచినీటిని అందించాలని చేర్యాల సబ్ డివిజన్ మిషన్ భగీరథ ఇంట్రా డీఈ కృష్ణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉన్న రైతువేదికలో గ్రామాలల్లోని మంచినీటి సరాఫరా చేసే సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు మంచి నీటిని అందించాలనే లక్ష్యంతో అక్టోబర్ 1 వరకు నాలుగు రోజుల పాటు మంచి నీటిని సహాయకులకు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

అర్హులకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించండి

గజ్వేల్‌రూరల్: అర్హులైన లబ్ధిదారులకే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, బాధిత లబ్ధిదారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పట్టణంలోని ఐవోసీలో వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ బన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. స్థానికంగా గుర్తింపు కార్డుల లేనివారు, సొంత ఇళ్లు కలిగిన వారు, ఇంకే ఇంట్లో ముగ్గురు, నలుగురి పేర్లను ఎంపిక చేసి జాబితాను తయారు చేసి డ్రా తీసి డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ప్రకటించారని పేర్కొన్నారు. ఈ ఎంపికలో భారీ మోసాలు జరిగాయని విమర్శించారు. వాటిపై సమగ్ర సర్వే నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ వివరాలను కలెక్టర్‌తో పాటు మంత్రులకు అందజేశామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి సమగ్రంగా సర్వే నిర్వహించని అధికారులపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను చేపడుతామన్నారు. సీఐటీయూ నాయకులు వెంకటచారి, డబుల్ బెడ్‌రూమ్ బాధితులు పద్మ, కవిత తదితరులున్నారు.

ఎస్‌బీఐ సేవలు మరింత వేగవంతం

కొమురవెల్లి(సిద్దిపేట): గ్రామీణా ప్రాంతాల్లో ఎస్‌బీఐ సేవలు మరింత వేగవంతం చేసిందని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాకేశ్ కుమార్ అన్నారు. శుక్రవారం డీజీఎం వివేక్ చంద్ర జస్వాల్, రీజినల్ మేనేజర్ అరుణతో కలిసి ఆయన మల్లికార్జున స్వామి దర్శించుకుని పూజలు నిర్వహించారు.

రిజర్వేషన్లపై తెగని ఉత్కంఠ

ఆశవాహుల ఎదురుచూపులు

కోహెడరూరల్(హుస్నాబాద్): రిజర్వేషన్‌ల ఖరారు కోసం రాజకీయ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ఆతృతతో ఎదురుచూస్తున్నారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేస్తున్న ప్రభుత్వం ఇంకా స్పష్టత లేకపోవడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. తేలేదాక ఏమి చేయాలో తెలియక తర్జనభర్జన పడుతున్నారు. ఇవి ఖరారైతే నేరుగా రంగంలోకి దిగొచ్చని భావిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే కొందరు విందులు ఏర్పాటు చేస్తూ తమ అభిప్రాయాన్ని చెప్పి మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. మరికొందరు పోటీ చేయాలని ఉన్నా రిజర్వేషన్ తేలేదాక బయట పడటం ఎందుకనే ధోరణిలో ఉన్నారు.

మండలంలో 27 గ్రామ పంచాయతీలు

కోహెడ మండలంలో 27 గ్రామపంచాయతీలున్నాయి. 244 వార్డులున్నాయి. అలాగే మండలంలో 30,710 ఓటర్లు ఉన్నారు. పంచాయతీకి అనుగుణంగా ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేస్తుంది. ఎస్సీ, ఎస్టీ, బీసీలు, జనరల్ కేటగిరీలుగా విభజిస్తారు. ఇందులో 50 శాతం మహిళలకు కేటాయిస్తారు. ఇప్పటికే గ్రామ పంచాయతీలో ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శించి అభ్యంతరాలను స్వీకరించారు.

ఎవరి అంచనాలు వారివే..

గ్రామాల్లో సర్పంచ్‌గా పోటీ చేయాలని ఉత్సాహంతో ఉన్న ఆశావాహులు అంతా గతంలో ఉన్న రిజర్వేషన్ ఉంటుందా లేక మారుతుందా అని అంతర్మథనం చెందుతున్నారు. ఏ గ్రామం ఎవరికి రిజర్వు అవుతుందోనని అంచనాలు వేసుకుంటున్నారు. కొందరు తమకు అనుకూలంగా రిజర్వేషన్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. గతంతో పోలిస్తే ఇప్పటి పరిస్థితులు మధ్య చాలా మారడంతో అనేక మంది సర్పంచ్‌గా పోటీ చేయాలని ఉత్సాహం పెరుగుతోంది. ముఖ్యంగా యువత బరిలో నిలిచేందుకు ఎక్కువగా మొగ్గు చూపుతోంది. ఈసారి గ్రామాల్లో తీవ్రమైన పోటీ ఉండటం ఖాయంగా కనిపిస్తోంది.



రంగం సిద్ధం చేసుకుంటున్నారు..

రిజర్వేషన్ల వ్యవహారం ఎప్పుడు తేలుతుందని ఆశావహులు ఆసక్తిగా వేచి చూస్తున్నారు. తమకు అనుకూలిస్తే రంగంలోకి దిగడానికి గతంలో పోటీ చేసిన అభ్యర్థులు ఇప్పటికే రంగం సిద్ధం చేసుకున్నారు. కొందరు ఇప్పటికే గ్రామాల్లో విందులు ఇస్తుండగా మరికొంతమంది కలిసిన వారినందరిని తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ల అంశం కీలకంగా మారింది. ఒక వేళ మహిళలకు రిజర్వేషన్‌లు వస్తే భార్యలను రంగంలోకి దింపడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి రిజర్వేషన్లపై స్పష్టత రాలేదని అధికారులు చెబుతున్నారు.

ఈసారి పురుషులకు రావాలని కోరుతున్నా..

పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్ కోసం ఎదురు చూస్తున్నాం. రిజర్వేషన్ వస్తే పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నా. రిజర్వేషన్ వస్తే ప్రచారం మొదలుపెడతా. గతంలో మా గ్రామంలో రెండుసార్లు మహిళలకే రిజర్వేషన్ వచ్చింది. ఈసారి పురుషులకు రావాలని కోరుతున్నాం.

– పాము శ్రీకాంత్, తంగళ్లపల్లి

ఎన్నికలకు సిద్ధం

రిజర్వేషన్లపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. గ్రామ పంచాయతీల్లో ముసాయిదా విడుదల, అభ్యంతరాలు స్వీకరించాం. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు షెడ్యూల్ ప్రకారం ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం . ప్రభుత్వం ఎప్పుడు ప్రకటించిన ఎలక్షన్‌లు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– కృష్ణయ్య, ఎంపీడీఓ, కోహెడ

పనితోనే గుర్తింపు: ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

కొండపాక(గజ్వేల్): ఉద్యోగ సమయంలో చేసిన పనితోనే గుర్తింపు లభిస్తుందని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లిలో పీజీహెచ్ఎం గోపాల్‌రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో గొప్ప పేరున్న ఉపాధ్యాయ వృత్తికి టీచర్‌లు వన్నె తేవాలన్నారు. అంకిత భావంతో పని చేయడంతో ఎంతోమంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దవచ్చన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ గ్రహీత దంపతులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



గోపాల్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్సీరఘోత్తంరెడ్డి

చదువుతోపాటు క్రీడలు అవసరం

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: క్రీడల్లో రాణించి గజ్వేల్ ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి పిలుపునిచ్చారు. ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో స్థానికంగా జరుగుతున్న మండలస్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీడాకారులు తమలోని ప్రతిభను చాటుకునేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని పిలుపునిచ్చారు. గెలుపోటములు సహజమని ఓటమితో నిరాశ చెందకుండా విజయం వైపు అడుగులు వేయాలన్నారు. ఈ సందర్భంగా అండర్–14, 17 బాలుర విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో విజేత, రన్నరప్ జట్లకు బహుమతులు ప్రదానం చేసినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ భవాణి తెలిపారు. కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్, ఎంఈఓ కృష్ణ, కౌన్సిలర్లు, కాంప్లెక్స్ హెచ్ఎంలు, పీడీలు రవి, విజయరేఖ, నాగేశ్, విశాల, ప్రశాంత్ పాల్గొన్నారు.



బాలికల విభాగంలో కేజీబీవీ కబడ్డీ జట్టుకు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్సీయాదవరెడ్డి

స్వచ్ఛతలో భాగస్వామ్యం కావాలి

హుస్నాబాద్: స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దడంలో ప్రజలు భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలో శుక్రవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా సైక్లథాన్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు తమ సైకిళ్లతో ర్యాలీ నిర్వహించారు. గాంధీ చౌరస్తాలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి స్వచ్ఛత, పర్యావరణం, చెత్త విభజన, ప్లాస్టిక్ నిషేధంపై డ్రాయింగ్ వేసిన చార్ట్ ప్రదర్శిస్తూ స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. పట్టణ ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని రజిత అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



హుస్నాబాద్: ర్యాలీలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలు సురక్షితం

దుబ్బాకటౌన్: పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డలు సురక్షితంగా ఉంటారని, రాబోయే తరం ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కావాలంటే గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషకాహారం తప్పనిసరిగా అవసరమని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి , దుబ్బాక సీడీపీఓ ఎల్లయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలో వైశ్యభవన్‌లో పోషకాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రతీ సంవత్సరం పోషణ్ అభియాన్‌లో భాగంగా సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు పోషకాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించి పోషణ్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది యశోద, శ్యామల, దుబ్బాక బ్లాక్ కోఆర్డినేటర్ శ్యామసన్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాల్సిందే

గజ్వేల్‌రూరల్: పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించేలా ప్రభుత్వం చొరవ చూపాలని పశువైద్య సంచార వాహన(1962) సిబ్బంది ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, నియోజకవర్గంలో మూగజీవాలు, పశువులకు (1962 సంచార వైద్యశాల) అంబులెన్స్ ద్వారా ఉచిత వైద్య సేవలందిస్తున్నామన్నారు. 15 నెలలుగా నిధులు విడుదల కాకపోవడంతో సకాలంలో వేతనాలు రాకపోవడంతో దుర్భర పరిస్థితులను గడుపుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు.

సస్య సంరక్షణతో సత్ఫలితాలు : ఏడీఏ

దుబ్బాకటౌన్: వరి, పత్తి పొలాల్లో సస్యసంరక్షణ చర్యలు పాటిస్తే మంచి ఫలితాలు ఆశించవచ్చని గజ్వేల్ ఏడీఏ బాబునాయక్ అన్నారు. శుక్రవారం రాయపోల్ మండలంలోని కొత్తపల్లి గ్రామపరిధిలో ఉన్న వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం పత్తి, వరిలో వచ్చే చీడపీడలు, తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలు పాటించాలన్నారు. ప్రస్తుతం వరిలో కాండం తొలుచు పురుగు, కంపునల్లి, గింజ మచ్చ తెగులు వచ్చే అవకాశం ఉందన్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రాధాన్యం : బక్కి వెంకటయ్య

దుబ్బాక: ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి అన్నారు. శుక్రవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్‌లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడా పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

అకాడమిక్ అంశాలపై దృష్టి పెట్టండి

జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): విద్యార్థుల అభ్యసన స్థాయి పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తపాస్‌పల్లి, రసులాబాద్, కొమురవెల్లి ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు అకాడమిక్ అంశాలపై దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల అభ్యసన స్థాయిని పెంచాలన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు సమయపాలన పాటించాలన్నారు. దీంతో పాటు పాఠశాలలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఆయా పాఠశాలలో పరిసరాలను పరిశీలించారు. నూతన ఎంఈఓ రమేశ్ ఉన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలని ధర్నా

హుస్నాబాద్: పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల రుణాలను మాఫీ చేస్తూ మరోవైపు నిత్యావసరాల ధరలను పెంచి పేద ప్రజలపై భారం మోపుతుందన్నారు. ఈ ధరలు అడ్డూఅదుపు లేకుండా పెంచి ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సరిపడా నిత్యావసర వస్తువులు నిల్వ ఉన్నప్పటికీ, కృత్రిమ కొరతను సృష్టించి బడావ్యాపారులు ధరలు పెంచుతున్నారని తెలిపారు. నాయకులు సంజీవరెడ్డి, బాలయ్య, రాజ్‌కుమార్, వెంకటస్వామి, ప్రసాద్ ఉన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కబడ్డీ విజేత టీజీడబ్ల్యూఆర్ఎస్ – బాలిక విన్నర్ ఏంజేపీ వర్గల్

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల (కోఎడ్యుకేషన్) మైదానంలో కొనసాగుతున్న జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ బాలబాలికల అండర్ 19 కబడ్డీ క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. బాలుర విభాగంలో టీజీడబ్ల్యూఆర్ఎస్ చేర్యాల ప్రథమ, ఎంజేపీ గొల్లపల్లి ద్వితీయ, ఎంజేపీ దౌల్తాబాద్ తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో ఎంజేపీ వర్గల్ ప్రథమ, ఎంజేపీ చింతమడక ద్వితీయ, టీజీఎంస్ గజ్వేల్ తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఎస్‌జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ సమ్మయ్య మాట్లాడుతూ పోటీలను ప్రశాంతంగా నిర్వహించామన్నారు.

సదుపాయాల కల్పనకు కృషి

బెజ్జంకి(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం కృషి చేస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ పేర్కొన్నారు. బెజ్జంకి కస్తూరిబా పాఠశాలలో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణాలను శుక్రవారం పరిశీలించారు.

చర్యలు తీసుకుంటున్నాం: ఈఈ

గజ్వేల్‌రూరల్: ప్రజలకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని మిషన్ భగీరథ పథకం ఈఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. పట్టణంలోని ఐవోసీలోగల మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన వాటర్‌మెన్, ఎంపీడబ్ల్యూ, కారోబార్(మంచినీటి సహాయకులు)లకు నీటి సరఫరా వ్యవస్థపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈఈలు ప్రవీణ్ (ఇంట్రా), రాజు(గ్రిడ్), ఎంపీఓ దయాకర్, ఏఈఈ రవితేజ, మాస్టర్ ట్రైనర్ రాజు పాల్గొన్నారు.

జీఓ 25ను సవరించండి

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఉపాధ్యాయులను సర్దుబాటు చేసే జీఓ 25ను వెంటనే సవరించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకట్‌కిరణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అశాస్త్రీయమైన సర్దుబాటు జీఓ 25ను సవరించాలన్నారు. సర్దుబాటుకు ముందే బదిలీ అయినా ఎస్‌జీటీలను రిలీవ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాంచంద్రం, కృష్ణ, పరశురాములు, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): విద్యాశాఖలో ఉన్న ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయడానికి సర్దుబాటు పేరుతో విడుదల చేసిన జీఓ 25ను సవరించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ర యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం దూల్మిట్ట మండలంలో ఉన్న వివిధ పాఠశాలల్లో టీఎస్‌యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీఓ నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తే పాఠశాలలకు నష్టం కలుగుతుందన్నారు.



జగదేవ్‌పూర్ పాఠశాలను సందర్శిస్తున్న యూటీఎఫ్ నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ డిజిటల్ లావాదేవీలపై జరభద్రం..

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు డిజిటల్ లావాదేవీలు, సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఆర్‌బీఐ హైదరాబాద్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ రాధిక భరత్ పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లోగల మహిళా డిగ్రీ కళాశాలలో వాణిజ్య విభాగం, భారతీయ రిజర్వ్‌బ్యాంక్(ఆర్‌బీఐ)హైదరాబాద్ సహకారంతో శుక్రవారం డిజిటల్ లావాదేవీలు–సైబర్ మోసం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డిజిటల్ లావాదేవీల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, సెల్‌ఫోన్‌లకు వచ్చే ఓటీపీలు, మెసేజ్‌లకు స్పందించవద్దన్నారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీలత, అధ్యాపకులు డాక్టర్ బాల్‌చంద్రం, డాక్టర్ లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి తాను వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 21 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని శుక్రవారం సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.25వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

◆ సన్మానం

బెజ్జంకి(సిద్దిపేట): ఎంఈఓగా బదిలీపై వచ్చిన నూతన ఎంఈఓ మహతిలక్ష్మిని శుక్రవారం ఎస్‌టీయూ, డీటీఎఫ్ సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎస్‌టీయూ ఆర్థిక కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్, డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వెంకటప్రవీణ్ కుమార్, శంకరాచారి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ శరన్నవరాత్రి ఉత్సవాలకు రండి



చేర్యాల(సిద్దిపేట): మండలపరిధిలోని ఆకునూరు గ్రామం భవానీ రుద్రేశ్వర ఆలయంలో ఉల్లెంగుల సేవా ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు రావాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని శుక్రవారం ట్రస్టు చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఉల్లెంగల ఏకానందం ఆహ్వానించారు.

◆ ఎల్‌డీ 6 కెనాల్ పై సర్వే

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని బస్వాపూర్ ఎల్‌డీ 6 కెనాల్‌పై ఆర్ఐ సురేందర్ సర్వే నిర్వహించారు. ఆ మేరకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గ్రామంలోని పలు సర్వే నంబర్‌లలో కొలతలు తీసుకున్నారు.

◆ ఎంఈఓల బాధ్యతల స్వీకరణ

తొగుట(దుబ్బాక): మండల విద్యాధికారిగా నర్సయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఆ స్థానంలో పనిచేసిన యాదవరెడ్డి బదిలీపై చిన్నకోడూరు వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో నర్సయ్య బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా కృషి చేస్తానన్నారు. ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన నర్సయ్యను ఉపాధ్యాయులు సన్మానించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగిరెడ్డి, మండలాధ్యక్షుడు రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

దౌల్తాబాద్ (దుబ్బాక): దౌల్తాబాద్ మండల నూతన విద్యాధికారిగా తిర్మలాపూర్‌లో ఉన్న జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీనియర్ ప్రధానోపాధ్యాయులు గజ్జల కనకరాజు శుక్రవారం రోజు బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో సిబ్బంది శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు.



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బాపూజీ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగిద్దాం

బడుగు, బలహీన వర్గాల స్ఫూర్తి ప్రదాత కొండా లక్ష్మణ్ బాపూజీ అని, ఆయన ఆశయాల సాధన కోసం కృషి చేస్తామని వక్తలు అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లావ్యాప్తంగా ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటాల వద్ద పూలమాలలేసి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో మొదటి వరుసలో ఉండి తన మంత్రి పదవినే త్యాగం చేసిన గొప్ప త్యాగశీలి అని గుర్తుచేసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, మాజీప్రజాప్రతినిధులు, పలు రాజకీయపార్టీల నేతలు, ప్రజాసంఘాల నేతలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బెజ్జంకి: ప్రభుత్వ కళాశాలలో..



సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో...



మద్దూరులో..



హుస్నాబాద్‌లో.. నివాళులు అర్పిస్తున్న నాయకులు



దుబ్బాకటౌన్: మున్సిపల్ కార్యాలయంలో..



ములుగు(గజ్వేల్): విశ్వవిద్యాలయంలో..